## విప్ బాల్క సుమన్‌కే మా మద్దతు

**ఏకగ్రీవ తీర్మానం అందజేసిన న్యాయవాదులు**

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 5: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్‌కే మద్దతు తెలుపుతున్నామని బార్ అసోసియేషన్ సభ్యులు స్పష్టం చేశారు. గురువారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని కోర్టు సముదాయంలో నిర్వహించిన సమావేశంలో వారు ఏకగ్రీవ తీర్మానం చేసి.. బాల్క సుమన్‌కు తీర్మాన కాపీని అందజేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి యజ్ఞంలో అందరూ భాగస్వాములవ్వాలని విప్ న్యాయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు గౌడ్, చెన్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

## ఛీ..ఛీ.. గడ్డం వినోద్

- కాంగ్రెస్ నేత ఫోన్ నుంచి న్యూడ్ వీడియో పోస్టు
- సోషల్ మీడియాలో వైరల్.. మహిళల మండిపాటు

బెల్లంపల్లి, అక్టోబర్ 5: మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ ఆశావహ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ బుధవారం రాత్రి తన మొబైల్ ఫోన్ నుంచి మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ వాట్సాప్ గ్రూప్‌లో న్యూడ్ వీడియోలను పోస్టు చేసి ఛీత్కారాలకు గురయ్యారు. ఈ వీడియోలను చూసిన సదరు గ్రూప్ సభ్యులు ఇదేమిటని ప్రశ్నించారు. మహిళా సంఘాల సభ్యులు మండిపడ్డారు. ఈ వీడియోలపై ఆలస్యంగా మేల్కొన్న వినోద్ వెంటనే వాటిని డిలీట్ చేశారు. అప్పటికే తీసిన వాటి స్క్రీన్‌షాట్స్ గురువారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వెంటనే ఆ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి వినోద్ ఓ ప్రకటన విడుదల చేశారు. తనకు చెందిన మరో మొబైల్ ఫోన్ డ్రైవర్ వద్ద ఉంటదని, దీనిని తానెప్పుడూ ఉపయోగించలేదని వివరించారు. డ్రైవర్ పొరపాటుతో ఇది జరిగిందని, వైరల్ అయిన వీడియోతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని దాటవేశారు.



గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ప్రగతి నివేదన బహిరంగ సభకు విశేష సంఖ్యలో హాజరైన మహిళలు

# బీఆర్‌ఎస్‌లో సమరోత్సాహం

- కార్యక్షేత్రంలో దూసుకెళ్తున్న గులాబీ పార్టీ శ్రేణులు
- రాష్ట్రాన్ని చుట్టేస్తున్న మంత్రులు కేటీఆర్, హరీశ్
- ప్రజలతో మమేకమవుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- అభ్యర్థులపై ఎటూ తేల్చుకోలేక సందిగ్ధంలో కాంగ్రెస్, బీజేపీలు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించే లక్ష్యంతో గులాబీ శ్రేణులు కదనోత్సాహంతో ముందుకు సాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ శ్రేణుల సమరోత్సాహాన్ని చూసి కాంగ్రెస్, బీజేపీ బెంబేలెత్తిపోతున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలక, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్, ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు గత పదిరోజులుగా రాష్ట్రంలోని దాదాపు అన్ని నియోజకవర్గాలను చుట్టివస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, భూమిపూజలు చేస్తూ కలియతిరుగుతున్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణాలకు భూమిపూజలతో మంత్రి హరీశ్‌రావు, హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల్లో ఐటీ పార్కుల ప్రారంభోత్సవాలు, భూమిపూజలతో మంత్రి కేటీఆర్ ఎడతెరపిలేని కార్యక్రమాలతో బిజీబిజీగా సాగుతున్నారు. మరోవైపు మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్, సబితాఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సత్యవతిరాథోడ్, పట్నం మహేందర్‌రెడ్డి, మహమూద్‌అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ వారి వారి ఉమ్మడి జిల్లాల్లో అటు అభ్యర్థులైన ఎమ్మెల్యేలను, పార్టీ శ్రేణులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నారు.



గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ప్రగతి నివేదన బహిరంగ సభలో మాట్లాడుతున్న మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్

### విపక్షాల విషప్రచారాన్ని తిప్పికొడుతూ...

ఆత్మీయ సమ్మేళనాలు, 21 రోజుల దశాబ్ది ఉత్సవాలు, పోడుభూములకు అటవీ భూయాజమాన్య హక్కు పత్రాల పంపిణీ, మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాలతో గత మూడు, నాలుగునెలల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు అన్ని స్థాయిల పార్టీ శ్రేణులతోపాటు ప్రజలతో పూర్తిగా మమేకమైపోయారు. దేశానికే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, మంత్రులపై కాంగ్రెస్, బీజేపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నియోజకవర్గాల్లో అన్ని స్థాయిల పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ తిప్పికొడుతున్నాయి. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గంలో జరిగిన ప్రగతి, 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో దుర్గతిని వివరిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రజల్లోకి దూసుకుపోతున్నాయి. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను నేరుగా కలుస్తూ సీఎం కేసీఆర్ మూడోసారి అధికారం చేపట్టాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తున్నారు.

### కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల్లో నిర్వేదం

ఒకవైపు బీఆర్‌ఎస్ అభ్యర్థులు నియోజకవర్గాల్లో కలియతిరుగుతుంటే, కాంగ్రెస్, బీజేపీ టికెట్లు ఆశిస్తున్నవారు ఢిల్లీ చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. రకరకాల కమిటీలు, వడపోతల పేరుతో అధిష్ఠానం కాలయాపన చేస్తున్నదనే నిర్వేదం కాంగ్రెస్ ఆశావాహుల్లో వ్యక్తమవుతున్నది.

### సమన్వయమే సంపూర్ణ విజయం

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లు ఇలా వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నేతలంతా నిత్యం ప్రజలతో ఉండాలని సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఏ రీతిలో అమలు అవుతున్నాయనే విషయాన్ని పార్టీ మానిటరింగ్ సెల్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నది. ఆయా నియోజకవర్గాల్లో అనుసరించాల్సిన వ్యూహ, ప్రతివ్యూహాలను ఎమ్మెల్యేలకు అందిస్తున్నది. 2014, 2018 ఎన్నికల్లో అనుసరించిన సమన్వయ వ్యూహాన్ని ఎన్నికల షెడ్యూల్ కన్నా ముందే అమలు చేస్తూ వినూత్నంగా ముందుకు సాగుతున్నది. ఈ సమన్వయమే బీఆర్‌ఎస్‌ను మూడోసారి అతి సునాయాసంగా అధికారంలోకి తీసుకొస్తుందనే ధీమాతో గులాబీ దండు ముందుకు సాగుతున్నది.

# 'అసంతృప్తుల' కమిటీలు

- ఎన్నికల కోసం బీజేపీ 14 కమిటీలు
- పార్టీలోని అసంతృప్తులకు తూతూమంత్రపు బాధ్యతలు
- చిన్నాచితకా పార్టీలతో ఎన్నికల పొత్తుకు ప్రయత్నం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల కోసం గురువారం బీజేపీ ప్రకటించిన 14 కమిటీలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలో నిరసనగళం వినిపిస్తున్నవారు, పార్టీ వీడే అవకాశం ఉందని ప్రచారంలో ఉన్నవారికి ఈ కమిటీల్లో చోటివ్వడంతో వీటిని 'అసంతృప్తుల కమిటీలు'గా అభివర్ణిస్తున్నారు. పార్టీపై ఆగ్రహంతో ఉన్న వారిని చల్లబరిచేందుకే ఈ కమిటీలు వేసినట్టు తెలుస్తున్నది. మరీ విచిత్రంగా 'ఆందోళనలు/నిరసన ప్రదర్శనల' కోసం ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించడం గమనార్హం. ఈ కమిటీకి మాజీ ఎంపీ విజయశాంతిని చైర్‌పర్సన్‌గా నియమించడం మరో విశేషం. గత కొన్ని నెలలుగా పార్టీపై బహిరంగంగానే నిరసన తెలుపుతున్న ఆమెకు మంచిపదవే దక్కిందంటూ నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. పార్టీ వీడతారన్న ప్రచారంలో ఉన్న మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, వివేక్‌వెంకటస్వామి, గరికపాటి మోహన్‌రావు, రాజగోపాల్‌రెడ్డి వంటివారికి ఈ కమిటీల్లో చోటు కల్పించారు. ఈ జాబితాలు చూస్తుంటే అవి పార్టీ కమిటీల్లా లేవని, అసంతృప్త నేతలను బుజ్జగించేందుకు, వారు బయటకు వెళ్లకుండా ఆపేందుకు వేసిన తూతూమంత్రపు కమిటీల్లా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### పరువు పోతుందని ఆందోళన

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి రాష్ట్రంలో రోజురోజుకు ఆదరణ కరువవుతున్నది. 119 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీకి అభ్యర్థులే దొరకడం లేదు. అన్ని స్థానాల్లోనూ అభ్యర్థులను నిలబెట్టకుంటే పార్టీ పరువు పోతుందన్న ఆందోళన పార్టీలో వ్యక్తమవుతున్నది. పరువు నిలబెట్టుకునేందుకు చిన్నాచితకా పార్టీలతో పొత్తు పెట్టుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. అందులో భాగంగా జనసేనతో బీజేపీ నేతలు చర్చలు జరుపుతున్నారని, తెలంగాణలోని 32 స్థానాల్లో బరిలోకి దిగబోతున్నట్టు ఆ పార్టీ ప్రకటించడం అందులో భాగమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. టీడీపీ, మందకృష్ణ మాదిగ పార్టీలతోనూ బీజేపీ చర్చిస్తున్నదని, వారికి తలాకొన్ని సీట్లు ఇచ్చి పరువు కాపాడుకోవాలని బీజేపీ గట్టిగా ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

# సింగరేణి ఎన్నికలు వాయిదా వేయండి

### హైకోర్టులో యాజమాన్యం అప్పీల్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ సింగరేణి యాజమాన్యం అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిని విచారించిన ద్విసభ్య ధర్మాసనం ప్రతివాదులైన సింగరేణి వర్కర్స్ యూనియన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. గుర్తింపు సంఘానికి అక్టోబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలన్న సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ సింగరేణి యాజమాన్యం అప్పీల్ చేసింది. దీనిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అక్టోబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలన్న ఉత్తర్వులను రద్దుచేయాలని కోరడం లేదని, ఆ గడువును పొడిగించాలని మాత్రమే కోరుతున్నామని యాజమాన్యం తరపు న్యాయవాది చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులంతా శాసనసభ ఎన్నికల విధుల్లో తలమునకలయ్యారని, ఈ పరిస్థితుల్లో అక్టోబర్ నాటికి




ఎన్నికలను నిర్వహించడం కష్టమని వివరించారు. ఆరు జిల్లాల్లో 15 యూనియన్లకు 40 వేల మంది కార్మికులు ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికల కారణంగా సింగరేణి ఎన్నికల నిర్వహణకు సహకరించలేమని కలెక్టర్లు చెప్పారని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే మరో నెలకు సింగరేణి యూనియన్‌కు ఎన్నికలు నిర్వహించగలమని హామీ ఇచ్చారు. 15 యూనియన్లలో 13 యూనియన్లు ఎన్నికల వాయిదాకు అంగీకరించాయని చెప్పారు. దీనిపై కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వర్కర్స్ యూనియన్లను ఆదేశించిన కోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది.

# కాంగ్రెస్ వస్తే అధోగతే

- ఆరిపోయే దీపాలు కాంగ్రెస్, బీజేపీ
- ప్రతిపక్షాలకు దిమ్మదిరిగేలా బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో
- ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ కొట్టేది కేసీఆర్ ప్రభుత్వమే
- మెదక్‌లో మెడికల్ కాలేజీ శంకుస్థాపన సభలో మంత్రి హరీశ్

మెదక్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, బీజేపీ ఆరిపోయే దీపాలని, కాంగ్రెస్ అధికారంలో వస్తే రాష్ట్రం అథోగతి పాలవుతుందని మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. గురువారం మెదక్‌లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి రూ.180 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంతకుముందు మెదక్‌లో రూ. 50 లక్షలతో నిర్మించిన సఖి కేంద్రాన్ని, రూ. 2.5 కోట్లతో నిర్మించిన జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం, రూ.70 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం మెదక్ చర్చి మైదానంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. బీజేపీ నేతలేమో కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ బీ టీం అంటారని, కాంగ్రెసోళ్లేమో బీజేపీకి బీ టీం అంటారని పేర్కొన్నారు. తామెవరికీ బీ టీం కాదని.. తాము తెలంగాణ ప్రజల టీం అని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలే తమకు హైకమాండ్ అని తేల్చి చెప్పారు. రాజకీయ లబ్ధి కోసమే బట్టకాల్చి మీద వేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ మెడలు వంచి కేసీఆర్ తెలంగాణ తీసుకొచ్చారని పేర్కొన్నారు. తెలంగాణను ఇస్తామని కామన్ మినిమమ్ ప్రోగ్రాం పెట్టింది బీజేపీ కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలకు రాష్ట్రంలో ప్రతిపక్ష హోదా కూడా లేదని గుర్తు చేశారు. మెదక్‌లో మెడికల్ కాలేజీతోపాటు మరో 180 కోట్లతో దానికి అనుబంధంగా 450 పడకల దవాఖానను నిర్మిస్తామని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం ఇక హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. ఘణపురం ఆయకట్టు పెంచి కాల్వలకు మరమ్మతులు చేసిన తర్వాత మెదక్ జిల్లాలో రెండు పంటలు పండుతున్నాయని వివరించారు.



మెదక్‌లో మెడికల్ కళాశాల నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

> గతుకుల మెదక్‌ను కేసీఆర్ బతుకుల మెదక్‌గా మార్చారు. మెదక్‌లో కాంగ్రెస్ గెలిస్తే కైలాసంలో పెద్ద పాము మింగినట్టే. డబ్బుల కట్టలు గెలవాలా? మెదక్ ఆత్మ గౌరవం గెలవాలా? డబ్బు సంచులతో పెద్దపెద్ద కార్లలో వస్తున్నవారిని చూసి మోసపోవద్దు. సాదాసీదా మెదక్ ఆడ బిడ్డ పద్మక్కను గెలిపించాలి. - మంత్రి హరీశ్‌రావు

### కేసీఆర్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండ్ బ్లాంకే

త్వరలో సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో ప్రకటిస్తారని, అది చూసి ప్రతిపక్షాలకు మైండ్ బ్లాంక్ కావడం ఖాయమని మంత్రి హరీశ్ పేర్కొన్నారు. ఇందులో అన్ని వర్గాల సంక్షేమం ఉంటుందని తెలిపారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని పన్నాగాలు పన్నినా చివరికు హ్యాట్రిక్ కొట్టేది కేసీఆర్ బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రైతులు, మహిళలకు ఎలా మేలు చేయాలా? అని సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తున్నాయని మండిపడ్డారు.

### మెదక్‌కు గూండాల గ్యాంగ్

పెద్దపెద్ద కార్లు వేసుకుని డబ్బుల సంచులతో హైదరాబాద్ నుంచి మెదక్‌కు గూండాల గ్యాంగ్ బయలుదేరిందని, వాటిని చూసి మోసపోవద్దని ప్రజలను హరీశ్‌రావు కోరారు. గొర్రెల మంద మీద తోడేళ్లు దాడి చేసినట్టు ఒక ఆడ బిడ్డ మీద నోట్ల కట్టలతో దాడి చేయడానికి హైదరాబాద్ నుంచి బయలుదేరారని ఆరోపించారు. మెదక్‌లో మన ఆడబిడ్డను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పిలిస్తే పలికే మనిషి, మీ తోటి ఆడపడుచు, మీ ఇంట్లో అక్కగా, చెల్లిగా పనిచేసిన వ్యక్తి పద్మక్క మెదక్ జిల్లా సాధించిందని ప్రశ్నించారు. మెదక్‌కు ఘణపురం నీళ్లు తీసుకువచ్చిందని, మరెన్నో కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ మన పద్మక్క గెలవాల్సిందేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వాళ్లు గెలిసిండ్రంటే కైలాసంలో పెద్ద పాము మింగితే కింద పడ్డట్టు అవుతుందని హెచ్చరించారు. పద్మమ్మకు ఓటు వేసి గెలిపించి దీవించాలని మంత్రి హరీశ్‌రావు ప్రజలను కోరారు.

# స్వరాష్ట్రంతో జల హక్కులు

- 1956లో ఏపీలో విలీనంతో హక్కు కోల్పోయిన తెలంగాణ
- కృష్ణానదీ జలాల కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం
- తెలంగాణ ప్రజల గోస పట్టని ఉమ్మడి ప్రభుత్వాలు
- ఎడారిగా మారిన పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి భూములు
- స్వరాష్ట్రంలో గట్టిగా పోరాడిన భారత రాష్ట్ర సమితి సర్కారు
- కొత్త ట్రిబ్యునల్‌తో వాదనలు వినిపించే అవకాశం
- న్యాయమైన నీటి వాటా పొందేందుకు మార్గం సుగమం



### విలీనంతో హక్కులను కోల్పోయిన తెలంగాణ..

అంతరాష్ట్ర జల వివాదాల చట్టం 1956 ప్రకారం నదీ జలాల్లో నీటి వాటా కోసం రాష్ట్రం మాత్రమే వాదనలు వినిపించాల్సి ఉంటుంది. బేసిన్‌లోని ప్రాంతాలకు తమ వాదనలను వినిపించే హక్కులేదు. ట్రిబ్యునల్ కేటాయించిన జలాలను ఒక రాష్ట్రం తమ బేసిన్‌లోని ప్రాంతాలకు ప్రాధాన్యతపరంగా సమంగా పంచుకోవాల్సి ఉంటుంది. ఇదే తెలంగాణకు శాపంగా మారింది. 1956లో ఏపీతో విలీనంతో తెలంగాణ తీవ్రంగా నష్టపోయింది. కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీకి మొదటిసారి కేంద్రం 1969లో బచావత్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. కృష్ణా జలాల పునఃపంపిణీ కోసం 2004లో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్-2ను ఏర్పాటు చేసింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కాకపోవడంతో ఆ రెండు ట్రిబ్యునళ్ల ఎదుట వాదనలు వినిపించే అవకాశం, హక్కు తెలంగాణకు లేకుండా పోయాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు హైదరాబాద్ స్టేట్ 1935 నుంచే అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. అవన్నీ ఉమ్మడి పాలకులు అటకెక్కించారు.

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి పాలమూరు తెలంగాణలోనే అతిపెద్ద జిల్లా. 35 లక్షల ఎకరాలకుపైగా సాగు యోగ్యమైన భూములున్న జిల్లా. ఒక పక్క కృష్ణమ్మ.. మరో పక్క తుంగభద్ర.. ఇంకోపక్క భీమా.. దుందుబి.. చెప్పుకుంటూ ఎన్నో అపారమైన నీటి వనరులు. కోనసీమగా విలసిల్లాల్సిన పాలమూరు కరువుకు ఆలవాలమైంది. దేశవ్యాప్తంగా అత్యంత వెనకబడిన జిల్లాలుగా 9 గుర్తిస్తే అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఒకటిగా నిలిచింది. 40 లక్షల జనాభాలో సగానికిపైగా పొట్ట చేతపట్టుకుని వలసపోయేవారు. అందుకు కారణం ఆంధ్ర రాష్ట్రంతో తెలంగాణను విలీనం చేయటమే. విలీనంతో తెలంగాణ న్యాయమైన నీటి వాటా కోసం డిమాండ్ చేసే హక్కును కోల్పోయింది. బచావత్, బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునళ్ల ముందు వాదనలను వినిపించే అవకాశం చేజారిపోయింది. స్వరాష్ట్రంతోనే న్యాయమైన నీటి వాటా దక్కుతుందని నాటి ఉద్యమనేత, నేటి సీఎం కేసీఆర్ నినదించారు. పదేండ్లుగా అలుపెరగని పోరాటం చేసి, ట్రిబ్యునల్ ఏర్పాటు చేసేలా కేంద్రం మెడలు వంచారు.

### సహజ జలసూత్రాలకు తిలోదకాలు..

ఖోస్లా కమిటీ సూచనల ప్రకారం నదీ జలాలపై మొదటి హక్కు యాజమాన్య బేసిన్ రాష్ట్రాలకే ఉంటుంది. బేసిన్ అవసరాలు తీరిన తరువాతనే ఇతర ప్రాంతాలకు మళ్లించాలి. 1966 హెల్సింకీ రూల్స్, ప్రస్తుతం అమలులో ఉన్న యునైటెడ్ నేషన్స్ వాటర్ కోర్ కన్వెన్షన్ (1997)లు ప్రకారం బేసిన్‌లోని రాష్ట్రాలకు సమన్యాయం, సహేతుకత అంటే పరీవాహక ప్రాంతం, సాగుకు యోగ్యమైన భూములు, కరువు పీడిత గ్రామాలు ఇలా పలు అంశాల ఆధారంగా నదీ జలాలను పంపిణీ చేయాల్సి ఉంటుంది. కానీ ఉమ్మడి ఏపీ పాలకులు ఈ సహజ న్యాయ సూత్రాలన్నింటినీ తుంగలో తొక్కారు. రెండు ట్రిబ్యునళ్ల ఎదుట సీమాంధ్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టే ప్రాజెక్టులకే నీటి కేటాయింపులు చేసేలా వాదనలు వినిపించారు. అందుకు ఆర్డీఎస్, కేసీ కెనాల్స్‌కు చేసిన నీటి కేటాయింపులే ఉదాహరణ. 1970లో బచావత్ ట్రిబ్యునల్ ముందు ఆర్డీఎస్ కాలువకు, కేసీ కెనాల్‌కు సమానంగా నీటిని కేటాయించాలని వాదించాల్సిన నాటి ప్రభుత్వం, కేసీ కెనాల్‌కు 69.4 టీఎంసీలు, ఆర్డీఎస్ కెనాల్‌కు 15.9 టీఎంసీలు డిమాండ్ చేసింది. 1944 ఒప్పందం ప్రకారం కేటాయించాల్సిన అవసరం లేదని మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేసింది. ఉమ్మడి ఏపీ వాదనలతో ట్రిబ్యునల్ కేసీ కెనాల్‌కు 39.9 టీఎంసీలు, మహబూబ్‌నగర్ జిల్లాకు 15.9 టీఎంసీలు మాత్రమే కేటాయించింది. బ్రిజేశ్ ట్రిబ్యునల్ ఎదుట అసలు కేసీ కెనాల్ ఊసే ఎత్తకుండా ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద కుడి వైపునకు కొత్త కెనాల్ కోసం 4 టీఎంసీలు కేటాయించాలని కోరింది. ఆర్డీఎస్ గురించి వాదనలు వినిపించలేదు.

### స్వరాష్ట్రంతో వాదనలు వినిపించే అవకాశం

స్వరాష్ట్ర ఏర్పాటుతో, సీఎం కేసీఆర్ అలుపెరగని పోరాటంతో తెలంగాణ నేడు న్యాయమైన నీటి వాటాల కోసం ట్రిబ్యునళ్ల ఎదుట వాదనలను వినిపించే అవకాశాన్ని 70 ఏండ్ల అనంతరం తిరిగి దక్కించుకొన్నది. పరీవాహక ప్రాంతం, కరువు పీడిత ప్రాంతాలు, జనాభా.. ఇలా ఏ విధంగా చూసుకున్నా తెలంగాణకు కృష్ణా జలాల్లో 70 శాతం వాటా దక్కాల్సి ఉన్నది. అందుకోసం నేడు బలమైన వాదనలు వినిపించే అవకాశం ఏర్పడింది. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు నికర జలాలకు కేటాయించాలని డిమాండ్ చేసే వెసులుబాటు తెలంగాణకు దక్కింది.


**కృష్ణా జలాలకు సంబంధించి ముఖ్యమైన పాయింట్లు**

| అంశం | తెలంగాణ | ఏపీ |
|---|---|---|
| పరీవాహక ప్రాంతం | 68.5% | 31.5% |
| ఆధారపడిన జనాభా | 71.9 | 28.1 |
| సాగు యోగ్యమైన భూములు | 69.8 | 30.2 |
| నీళ్లలో ప్రస్తుత వాటా | 36.86% | 63.14 శాతం |
| బేసిన్ అవతలికి తరలిస్తున్న జలాలు | 0 | 69% (350 టీఎంసీలు) |

# నేడు బీఆర్‌ఎస్‌లోకి మెదక్ డీసీసీ మాజీ అధ్యక్షుడు

- మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరనున్న తిరుపతిరెడ్డి
- ఇంకా చాలామంది మాతో టచ్‌లో ఉన్నారు
- వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మెదక్ డీసీసీ మాజీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు స్వయంగా తిరుపతిరెడ్డిని కలిసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. దీంతో సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి, మెదక్ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేసేందుకు ఆయన ముందుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 7 గంటలకు మంత్రి కేటీఆర్ సమక్షంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులతోపాటు తిరుపతిరెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరుతారని వెల్లడించారు. తిరుపతిరెడ్డి మంచి నాయకుడని, చాలా ఏళ్లుగా మెదక్ నియోజకవర్గ అభివృద్ధి కోసం విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు.



### చాలాచోట్ల కాంగ్రెస్‌కు అభ్యర్థుల కరువు

కాంగ్రెస్ పార్టీకి చాలా నియోజకవర్గాల్లో అభ్యర్థులే లేరని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆ పార్టీ పైసలకి టికెట్లు అమ్ముకుంటున్నదని, దానిని నమ్ముకున్న వారిని ఆ పార్టీ మోసం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోలేక కాంగ్రెస్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. ఇప్పటికీ ఒక్క టికెట్ కూడా ఇచ్చుకోలేని దుస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని, ఇంత బలహీన పరిస్థితుల్లో ఉన్న ఆ పార్టీ గెలుపును ఆశించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఇంకా చాలా మంది నాయకులు బీఆర్‌ఎస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని హరీశ్ వెల్లడించారు. బీఆర్‌ఎస్ ఏ పార్టీకి బీటీమ్ కాదని, తెలంగాణ ప్రజల టీమ్ అని పునరుద్ఘాటించారు. టికెట్లు ప్రకటిస్తే గందరగోళ పరిస్థితుల్లో పడతామని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు టికెట్ల కేటాయింపులో జాప్యం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌కి పోటీయే లేదని, మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు.